ఎదురుచూడని ప్రమాదం!

ఏ. వీ. మోహన్‌రావు

ఆదివారం.

సాయంత్రం ఆరుగంటలైంది.

మెరినా బీచ్ నిండా జనం.

మెరీనా కాంటీన్ ముందు నిలుచున్న నిరంజనరావు కళ్ళు రెండు మిత్రుడు మధుమూర్తి కోసం ఆత్రుతగా వెతకటం మొదలెట్టాయి.

నిరంజనరావు పెద్ద రేడియోలమ్మే షాపులో మానేజర్‌గా పని చేస్తున్నాడు. మధుమూర్తి లాయర్‌గా బోర్డు కట్టుకుని వున్నాడు.

మధుమూర్తి రేడియో కొన్నాడు ఐదు సంవత్సరాల క్రింద. అప్పుడేర్పడింది పరిచయం నిరంజనరావుతో. అది మొదలుకొని ఇద్దరూ ప్రతి ఆదివారం బీచ్‌లో కలుసుకోవడం మొదలెట్టారు. రాత్రి పదింటిదాకా పిచ్చాపాటీ మాట్లాడుకోవడం అలవాటు.

నిరంజనరావుకు పెళ్ళి పెటాకులు లేవు. మధుమూర్తికి భార్యా పిల్లలు వున్నారు. అందువల్ల అయిష్టంగానే విడి పోయేవారు.

వాళ్ళు కలుసుకున్నప్పుడల్లా చర్చించేది ఒకే ఒక్క విషయం. అది డబ్బు సులభంగా ఎలా సంపాదించటం అన్నదే! ఎన్ని రకాల, ఎంతమంది, ఎంత త్వరగా, ఎవ్వరికీ తెలీకుండా డబ్బుగలవాళ్ళవుతున్నారో తర్జన భర్జన చేసుకొంటూ వుంటారు.

"నిరంజన్!" దూరం నుంచే పిలుస్తూ వచ్చాడు మధు.

"ఏం లేటయింది?" అడిగాడు నిరంజనరావు.

"నీకేం! బ్రహ్మచారివి! నాకలా కాదుగా! ఇంటి గొడవలు వొదిలించుకొని రావాలిగా! అందుకని..." అన్నాడు నవ్వుతూ.

ఇద్దరూ కాంటీన్‌లోకి వెళ్ళి కాఫీలు త్రాగి వెలుపల కొచ్చారు. జనానికి దూరంగా వెళ్ళి సముద్రపు టంచున కూర్చున్నారు.

"ఏమిటి విశేషాలు?" సిగరెట్ పాకెట్‌పైనున్న సిలిఫోన్ పేపరు 'చించుతూ అడిగాడు లాయరు మధు మూర్తి.

"ఏమున్నాయి? మామూలే! కాకుంటే ఒక విచిత్రమైన విషయం తెలుసుకున్నాను."

"ఏమిటది?"

"మనం మామూలు మనిషనుకునేవాడికూడా ఫారిన్‌లో బాంక్ అకౌంటులు వుంటున్నాయి" అన్నాడు నిరంజనరావు.

"ఎవరా మామూలు మనిషి?"

"నువ్వు వినివుంటావు. లాయరు చంద్రశేఖరం.

గోపాలపురంలో వుంటున్నాడు. అతను ఒకే రోజున ఆరు టెలివిజన్ సెట్‌లు ఆరుగురు ఆడవాళ్ళ పేర్లమీద కొన్నాడు. వాటి ఖరీదు ఫారిన్ బ్యాంక్ పైన చెక్ ఇచ్చాడు'' అంటూ ఆగి సిగరెట్ అందుకున్నాడు నిరంజన్.

''అయితే...'' సిగరెట్ కాలుస్తూ అడిగాడు మధుమూర్తి.

''దాదాపు పాతిక వేల రూపాయల చెక్ ఇచ్చాడు అది స్విట్జర్లాండ్‌లో వున్న బాంక్ పైన.''

''ఏ మతనికి అకౌంటు వుండకూడదా?''

''అని కాదు.''

''మరి ఏమిటి నీ అనుమానం?''

''లైసెన్సులు తీసుకొనేందుకు అతను రాసిచ్చినవన్నీ ఆడవాళ్ళ పేర్లే! అందులో ఇద్దరు శరీరం అమ్ముకునే రకమని నాకు తెలుసు. దాన్నిబట్టి మిగిలినవాళ్ళు కూడా ఆ బాపతేననిపిస్తుంది.''

''అనిపించినంతమాత్రాన ఏమయింది. అతనికి డబ్బుంది, అనుభవిస్తున్నాడు. అందుకు నీ అభ్యంతర మేమిటి?'' అడిగాడు మధుమూర్తి.

''చంద్రశేఖరం దగ్గర దాన్నిబట్టి ఎంతో డబ్బు వుండ వచ్చుననిపిస్తుంది. అందులో కొంత మనం ఎందుకు అందు కోగూడదు?'' అన్నాడు నిరంజనరావు.

మళ్ళా అందుకొని ''అతనికి ఏ బ్యాంక్‌లో అకౌంటు వుంది మనకు తెలుసు. అందువల్ల అదేమంత పెద్ద కష్టం కాదనిపిస్తుంది. నేను దీనికో పథకం కూడా ఆలోచించాను'' అన్నాడు.

''ఏమిటది?'' వుత్సాహంగా అడిగాడు మధుమూర్తి

"మనలో ఒకరం ఏదో ఒక మారు పేరుమీద మధురలో అకౌంటు ఓపెన్ చేద్దాం. ఆ తర్వాత చంద్రశేఖరం రాసినట్లుగా ఉత్తరం రాసి ఒక లక్ష రూపాయలు మనం ఓపెన్ చేసిన అకౌంటుకు వెంటనే ట్రాన్స్‌ఫర్ చేయమందాం. డబ్బు రాగానే అది తీసుకుని అకౌంటు మూసేద్దాం," అన్నాడు నిరంజనరావు.

"ఒకవేళ ఆ బ్యాంక్ వాళ్ళు డబ్బు ట్రాన్స్‌ఫర్ చేస్తున్నట్లు చంద్రశేఖరంకు రాస్తే!"

"మామూలుగా ఇతర దేశాల్లో వున్న బ్యాంకులు సంవత్సరానికి ఒక్కసారి మాత్రమే లెక్కలు పంపుతాయి. ఈలోగా మన పని అయిపోతుంది. మనకిందులో ఏవిధమైన ప్రమాదంగానీ, ఆపదగానీ వుండదు."

మధుమూర్తి ఆలోచించసాగాడు మౌనంగా. అతని ఆలోచనలకు అడ్డం పోకుండా, నిరంజనరావు సిగరెట్ కాల్చసాగాడు.

"ఇందులో రెండు విషయాలున్నాయి. చంద్రశేఖరం అసలు అలాటి ఉత్తరాలు బ్యాంకుకు రాస్తాడా లేదా అన్నది తెలుసుకోవాలి. ఎలాంటి పేపరు వాడతాడు? ఎలాటి కబుర్లుపయోగిస్తాడో తెలుసుకోవాలి. రెండవది: అతని సంతకం ఫోర్జరీ చెయ్యాడం మనవల్ల కాదుకాబట్టి అందుకో మనిషిని వెతకాల్సి వుంటుంది. అందువల్ల మన పథకం మరికొందరికి తెలిసే అవకాశం వుంది" అన్నాడు మధుమూర్తి.

ఫోర్జరీ యెవరితోనయినా తంటాలుపడి చేయిద్దాం. పోతే చంద్రశేఖరం దగ్గర కాగితాలు, కవర్లు, దొంగిలించే మరోమనిషి కావాలి. ఆ ఇద్దరికి మనం ఈపథకం చెప్పవలసిన అవసరం నాకు కనిపించడం లేదు. ఏదో

కొంత ముట్టచెప్పి సంపాదించవచ్చు ననిపిస్తుంది'' అన్నాడు నిరంజనరావు.

మధుమూర్తి ఆలోచనల్లో పడ్డాడు.

''తొందరేం లేదు. నువ్వుకూడా ఆలోచించు. నేనూ ఆలోచిస్తాను. పథకం పకడ్బందీగా తయారుచేద్దాం. మనకు అన్నివిధాలా నచ్చితేనే అమలు జరుపుదాం. లేకుంటే మానేద్దాం!'' అన్నాడు నిరంజనరావు.

2

మధుమూర్తి ఇల్లు చేరేసరికి పిల్లలు నిద్రపోయారు. భార్య ఏదో వారపత్రిక చదువుకుంటూ కూర్చుంది. భర్త రావడంచూసి లేచివచ్చి తలుపు తీసింది.

''అయినాయా ఆదివారపు సరసాలూ సరదాలూ?'' అంది విసుగ్గా.

''ఏమిటే ఆ మాటలు. నేనెళ్ళేది పాత స్నేహితుడిని కలుసుకునేందుకు మాత్రమేనని ఎన్నిమార్లు చెప్పినా నమ్మవేం?''

''స్నేహితుడయితే అతన్ని యింటికి తీసుకురారేం?''

''అతనే రాడు.''

''ఏం? ఎందుకని?'' నిలదీసింది భార్య.

''మనకు ఇబ్బందిగా వుంటుందని.''

''మనకు అనకండి. మీకు అనండి. ఆడ స్నేహితులు కాబట్టి మీరు తీసుకురారు. ఆమె రాదు. అయినా మీకేం ఖర్మలెండీ! సంసారంచేసే లక్షణమేనా యిది?'' అంది కోపంగా.

"నోర్ముయ్! నా అందం, అధికారం, ఐశ్వర్యం చూసి ఎవతి నావల్లో పడుతుంది?"

"మీదగ్గర మనుషులుంటారు. పదండి భోజనంచేద్దురు గాని" అంది కాస్త మెత్తబడి.

"ఇంటికి ఎవరో వచ్చినట్లున్నారు? ఆ బ్యాగ్ యెవరిది?" అడిగాడు భార్యను.

"మా తమ్ముడు."

"ఎవరు? చంద్రమా?" అన్నాడు మధుమూర్తి.

"అవును."

"ఎందుకొచ్చినట్లో."

"ఏదో కేసు పెట్టాలిట" అంది కంచాలు పెడుతూ.

ఇద్దరూ అమాటా ఈమాటా మాట్లాడుకుంటూ భోజనాలు కానిచ్చారు. అంతలో చంద్రం వచ్చాడు.

"బాగున్నావా బావా?" అడిగాడు చంద్రం.

"ఆఁ! వచ్చీరాగానే వెళ్ళావెక్కడికోయ్?" అడిగాడు మధుమూర్తి.

"సినిమా చూద్దామని."

"ఏం మీవూళ్ళో లేవా?"

"ఉన్నాయి. ఇక్కడ క్రొత్తవి వుంటాయిగా. అందుకని" అంటూ కూర్చున్నాడు చంద్రం.

"తమ్ముడూ, ముందు భోజనానికిలే! తర్వాత బావతో కబుర్లు చెప్పొచ్చు" అంది మధుమూర్తి భార్య.

"నాకువద్దు. నేను బైటే తిన్నాను"

"అదేం రోగంరా!"

"ఇంటతిండి తిని తిని విసిగిపోయాను. అందుకని హోటల్లో భోజనం చేసొచ్చాను, మార్పుకోసం" అన్నాడు చంద్రం.

"అయితేనువ్వు వినుగ త్తితే పెళ్ళాన్నికూడా మార్చే లాగున్నావ్?" అన్నాడు మధుమూర్తి.

"వాడు మీ బావమరిదేగా?" అంది మధ్యలో అందుకుంటూ మధుమూర్తి భార్య.

"నువ్వువెళ్ళి పడుకోవే! చంద్రం ఇంతకూ అసలు పనేమిటి?"

"కోర్టులో కేసొకటి పెట్టాలి. ఒకతనికి డబ్బిచ్చాను. అతనీవూళ్ళో వుంటున్నాడు. అందుకని ఇక్కడ ఫైల్ చెయ్యాలి." అన్నాడు చంద్రం.

"సరేలే! వెళ్ళిపడుకో. పొద్దున్నే మాట్లాడుకుందాం" అన్నాడు మధుమూర్తి తనుకూడా నిద్రకుపక్రమిస్తూ.

అంతకుముందు స్నేహితుడు నిరంజనం చెప్పిన విషయం గుర్తుకొచ్చింది. దాన్ని గురించే అతని ఆలోచనలు మొదలయినాయి. చంద్రం రాకతో అతని మెదడులో క్రొత్త మెరుపొకటి మెరిసింది.

చంద్రంకూడా కేసుపెట్టేందుకొచ్చాడు. అతన్ని లాయర్ చంద్రశేఖరం వద్దకు పంపించి, కేసు అతనికి వకాల్తా ఇవ్వమంటే బాగుంటుందనిపించింది. తమపథకం వివరించి, చంద్రంచేతే కావలసిన వస్తువులు రహస్యంగా దొంగతనం చేయిస్తే క్షేమంగా జరిగిపోతుందనిపించింది.

చంద్రంకు పని అప్పగించబోయే ముందు ఒకమారు స్నేహితుడ్ని సంప్రదించడం మంచిదనిపించింది. తెల్లవారాక నిరంజనరావును కలుసుకుని మాట్లాడాలని తీర్మానించుకున్నాడు. తాను ఆలోచించిన పథకంలో ఒక ఘట్టం దాటినట్లుగా తోచి హాయిగా నిద్ర పట్టేసింది.

ఆ రాత్రంతా కలలతోనే గడిచిపోయింది. ఉన్నపళాన మధుమూర్తికి తను లక్షాధికారి అయినట్లు, కారు

కొన్నట్లు, బంగళా సంపాదించినట్లు, ఏవేవో వ్యాపారాలు ప్రారంభం చేసినట్లు, కళ్ళముందు వంద రూపాయల నోట్ల కట్టలు దొర్లుతున్నట్లు అనిపించింది.

3

రోజుటికన్నా ఆలశ్యంగా నిద్రలేచాడు ఆరోజు. భార్య గునుస్తూనే వుంది. పిల్లలు స్కూళ్ళకు తయారవుతున్నారు. చంద్రం కాఫీ టిఫిను సేవించి తీరిగ్గా పేపరు చదువుతూ కనిపించాడు.

"బావగారు బాగా పొద్దెక్కేదాకా పడుకున్నారే!" అన్నాడు చంద్రం నవ్వుతూ.

"ఆఁ! బావమరది వచ్చాడన్న సంతోషం మరి!" అంటూ కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్ళిపోయాడు.

"బావా! మా కేసు ఇవాళ ఫైలు చేద్దామా?" అడిగాడు చంద్రం.

"చూద్దాం! నాకీమధ్య కేసులు ఎక్కువయ్యాయి. వేరే లాయరుకు వకాల్తా చేద్దామని చూస్తున్నాను" అన్నాడు మధుమూర్తి.

"వేరే వాళ్ళంటే ఫీజు యిచ్చుకోవద్దూ..."

"అక్కర్లేదులేవోయ్. అదంతా నే చూసుకుంటాగా. నువ్వు తయారుకా. నాతోపాటు కోర్టుకు తీసుకెళతాను" అన్నాడు మధుమూర్తి.

పదింటికల్లా ఇద్దరూ బైట పడ్డారు.

హైకోర్టు దగ్గర ఆటో దిగాక చంద్రంను అక్కడే వుండమని, మధుమూర్తి పబ్లిక్ టెలిఫోన్ బూత్ లో కెళ్ళాడు. నెంబరు త్రిప్పి, అవతల వేపునుండి 'హలో' అన్న శబ్దం రాగానే డబ్బులు పడేశాడు.

"ఎవరు నిరంజనా?"

"ఆఁ! నేనే! మధు మాట్లాడుతున్నాడా?" అవతల వేపునుండి వినిపించింది.

"అవును" అంటూ రాత్రి కష్టపడి తను ఆలోచించిన దంతా వివరంగా చెప్పాడు.

నిరంజన్ అంతా ఓపిగ్గా విని "నీ ప్లాను బాగుంది. చంద్రం నీ బావమరది గాబట్టి, అతనితో ఉత్తరో త్తరా ఏవిధమైన కోరికలు కూడా వుండకపోవచ్చు. శుభస్య శీఘ్రం. అలాగే పని ప్రారంభం చెయ్యి."

"సరే! అవసరమైతే ఫోన్ చేస్తాను. లేకుంటే మళ్ళీ ఆదివారం రాత్రే మనం కలుసుకోవడం!" అంటూ ఫోన్ పెట్టేసి వెలుపలకు వచ్చాడు మధుమూర్తి.

చంద్రం, మధుమూర్తి హైకోర్టు ఆవరణలో ప్రవేశించారు. నిర్మానుష్యంగా వున్న ప్రాంతానికి తీసుకెళ్ళాడు చంద్రాన్ని.

ఇద్దరూ కూర్చున్నారు అక్కడ.

"చంద్రం! నీతో ఒక పనిపడింది. చాలా రహస్యంగా తెలివిగా చెయ్యాలి. అందుకు తగిన ప్రతిఫలం కూడా వుంటుంది చేస్తావా?"

"ప్రతిఫలం వుందంటే చేస్తాను."

"నే చెప్పేది విను. చెయ్యగలిగితే సరే! చేసేందుకు ఇష్టం లేకున్నా, భయం వేసినా, ఆ విషయాలు ఇక్కడే మరచిపో. సరేనా?"

"సరే బావా! చెప్పు."

"లాయర్ చంద్రశేఖరమని ఒకతను వున్నాడు. అతనికి మంచి ప్రాక్టీసు వుంది. నీ కేసు అతనికిస్తానని వెళ్ళాలి. అతను ఫీజు కాస్త ఎక్కువే అడుగుతాడు.

అయినా ఫరవాలేదు. అది నేనిస్తాను. అతనికి వకాల్తా ఇవ్వు. అతని దగ్గరనుండి కొన్ని కాగితాలు దొంగిలించి తెచ్చివ్వాలి నాకు" అన్నాడు మధుమూర్తి తాపీగా.

"దొంగతనమా?"

"ఆc! అదేం డబ్బు కాదు. అతని లెటర్ హెడ్ కాగితాలు కొన్ని కావాలి. అతను ఎవరికన్నా ఉత్తరాలు రాసేప్పుడు ఎలాంటి కవర్లు వాడతాడో అలాంటివి రెండు మూడు తస్కరించాలి. అతని సంతకం వున్న కాగితాలేవన్నా దొరికితే అవి కూడా తీసుకురావాలి!" అన్నాడు.

"అవి అంత సులభంగా దొరుకుతాయా?"

"దొరకవు. నువ్వు ఎలాగయినా నీ తెలివితేటలన్నీ వుపయోగించి దొరకబుచ్చుకోవాలి. నువ్వెటూ కేసు అతనికి అప్పగిస్తావు కాబట్టి అతని ఆఫీసుకు నాలుగయిదు సార్లు వెళ్ళే అవకాశం వుంటుంది. ఆ అవకాశం అదనుగా పెట్టుకుని ఈ కార్యం సాధించుకు రావాలి!" అన్నాడు మధుమూర్తి.

చంద్రం కాసేపు ఆలోచించాడు.

"ఈ పని చేసినందుకు నాకేమి ప్రతిఫలం యిస్తారు?" అడిగాడు చంద్రం.

"నీ కేసు ఫీజు యిస్తాను. అదిగాక ఐదువేలురూపాయలిస్తాను."

"అంతేనా?"

"అంటే నువ్వు చేసేపని విలువ అంతకన్నా ఎక్కువ విలువయిందని అనుకుంటున్నావా?" అడిగాడు మధుమూర్తి.

"కాకుంటే మీరు ఐదువేలు యిస్తారా?"

"కాదు; ఒక క్లయింటుకు సాయం చెయ్యడం కోసం మాకీ సరంజామా కావలసి వచ్చింది. అతను పదివేలిస్తానన్నాడు. అందులో సగం నీకు ఇస్తున్నాను. మిగిలింది నాకు" అన్నాడు మధుమూర్తి.

"మీరు చెప్పిందంతా నిజమేనా?"

"ఆఁ!"

"అయితే ఒప్పుకుంటున్నాను" అన్నాడు చంద్రం.

"థాంక్స్! నీ మేలు ఈ జన్మలో మరచిపోను" అన్నాడు మధుమూర్తి.

"అలాగే నా కిస్తామన్న ఐదువేల సంగతి కూడా మరచిపోకుండా వుంటే చాలు" అన్నాడు చంద్రం అక్కడ్నుంచి లేస్తూ.

మధుమూర్తి ఒక కాగితంపైన వివరంగా రాసిచ్చాడు లాయరు చంద్రశేఖరం అడ్రసు. దాన్ని తీసుకుని ఆటోఎక్కి వెళ్ళిపోయాడు చంద్రం. ఆటో కనుమరుగవగానే, హైకోర్టు ఆవరణలోంచి వెలుపలకొచ్చి, ఫోన్ బూత్‌లో కెళ్ళి నిరంజనరావు నెంబరు త్రిప్పాడు.

"నేను మధును మాట్లాడుతున్నాను" అన్నాడు అవతలి వేపునుండి నిరంజనరావు మాట్లాడగానే—

"ఏమిటి?" అడిగాడు నిరంజన్.

"మా చంద్రంతో మాట్లాడాను. అతను ఒప్పుకున్నాడు. మన పథకం అతనికేమాత్రం చెప్పలేదు. వేరే కబుర్లు కల్పించి చెప్పాను."

"గుడ్! అతనికేమాత్రం ఇస్తానన్నావ్?"

"ఐదు వేలు."

"అలాగే! సాయంత్రం మనం మెరీనాబీచ్‌లో కలుసుకుందాం."

"ఓ. కే."

అవతలి వేపునుండి ఫోన్ పెట్టిన శబ్దం కాగానే, తను కూడా ఫోన్ కట్ చేసి, వెలుపలకి వచ్చేశాడు.

చంద్రశేఖరం సంతకం ఫోర్జరీ చేసేదెలాగాని ఆలోచించసాగాడు. అతనికి తెలిసి చాలా కేసులు జరిగాయి. ఫోర్జరీ నేరాలపైన చాలామందిని కోర్టులో శిక్షించారు. అలాటి శిక్ష అనుభవించినవాళ్ళలోంచి ఎవరినన్నా ఒకర్ని ఏరుకుని, వాళ్ళచేత చేయిస్తే బావుంటుందేమోననిపించింది.

కోర్టు లైబ్రరీలోకి వెళ్ళి కూర్చున్నాడు. పాత కేసుల తాలూకూ రికార్డులు కొన్ని తీసుకుని ముందేసుకున్నాడు. అందులోంచి ఫోర్జరీ కేసుల కట్టలు వేరుగా పెట్టుకున్నాడు మధుమూర్తి. మూడు పేర్లు దొరికాయి. ముగ్గురికీ కఠినశిక్ష విధింపబడింది. ఇద్దరు ఇంకా జైల్లో వున్నారు. ఒక వ్యక్తి మాత్రం విడుదలయివుండాలనుకున్నాడు. అతని పేరు శ్రీనివాసరావు. వూరు ఏలూరు.

అడ్రసు నోట్ చేసుకున్నాడు.

4

సాయంత్రం మెరీనాబీచ్‌లో నిరంజన్, మధు ఇద్దరూ కలుసుకున్నారు.

ఫోర్జరీ సంతకం గురించి తను ఆలోచించిన విషయం చెప్పాడు మధుమూర్తి.

"ఈ పని చెయ్యడానికి డబ్బు కావాలి. సంతకం చేయించుకున్నాక అతను డబ్బు కోసం ఆగమంటే ఆగడు" అన్నాడు మధుమూర్తి.

"ఏమాత్రం అవసరం వుంటుంది?"

"రెండు వేలన్నా కావాల్సి వుంటాయి."

"మీ బావమరది సంగతి ఏమిటి?"

"వాడికి తర్వాత యివ్వవచ్చు."

"అంటే మనం దాదాపు ఐదారు వేలు పెట్టుబడి పెట్టాల్సి వుందన్నమాట! నా దగ్గర అంత డబ్బులేదు. నువ్వేమన్నా సర్దగలవా?"

"నాది అసలు కుంటి నడక" అన్నాడు మధుమూర్తి.

"ఆ విషయం నాకూ తెలుసు. అయితే ఏం చేద్దాం?"

"ఏం చెయ్యాలన్నా నువ్వే చెయ్యాలి. నావల్ల ఏమీ కాదు."

"సరే! ఎలాగో సర్దుతాను. చంద్రం ఇవాళ నువ్వు చెప్పిన కాగితాలని తెస్తాడంటావా?"

"వాడు అఖండుడు. తెచ్చినా తెస్తాడు. ఇవాళ గాకున్నా రెండు మూడు రోజుల్లో సాధించుకురాగలడు."

"అయితే ఈలోగా నేను మధుర వెళ్ళి రావటం మంచిది. అక్కడకు వెళ్ళి బ్యాంక్‌లో అకౌంట్ ఓపెన్ చేసి వస్తాను. ఆ కాగితాలు దొరికితే నువ్వు లెటర్ టైప్ చేయించి ఏలూరు వెళ్ళి, చంద్రశేఖరం సంతకం ఫోర్జరీ చేయించుకుని రా!" అన్నాడు నిరంజనరావు.

"అలాగే!" అన్నాడు మధుమూర్తి.

"నేను మధురకు రేపు రాత్రికి వెళ్తాను. వెళ్లేలోగా నీకు రెండువేలు ఇచ్చిపోతాను."

"సరే."

"నువ్వు ఫోర్జరీ సంతకం చేయించే ముందే లెటర్ హెడ్ పైన విషయం రాయటం మంచిది కాదనిపిస్తోంది. మేటర్ ఎంతవరకు వస్తుందో వూహించుకుని సరిగా ఆ క్రింద ఖాళీ కాగితంపైన చేయించు. వీలయినంతవరకు

రెండు మూడు కాగితాలపైన చేయించడం మంచిది. మనం టైప్ చేసుకొనేటప్పుడు ఏదయినా చెడిపోయినా రెండో కాగితం వాడుకోగలుగుతాం. ఏమంటావ్?" అడిగాడు నిరంజన్.

"అవును. నీ ఐడియా బావుంది" అన్నాడు మధుమూర్తి.

"ఇదంతా సవ్యంగా జరిగిపోతే మనం ఈ వూర్నించి వెళ్ళిపోయి ఏదయినా మంచి వ్యాపారం చేసుకుందామని పిస్తూంది" అన్నాడు నిరంజనరావు.

"వద్దు! అలా వెళ్ళిపోతే మనల్ని అనుమానించవచ్చు. అందువల్ల మనం ఇక్కడ వుండటమే మంచిది" అన్నాడు మధుమూర్తి.

"మీ బావమరది ఏం చేసుకొచ్చిందీ రేపు నాకు ఫోన్ చేసి చెప్పు!" అన్నాడు నిరంజన్.

"సరే!" అని కదిలాడు మధుమూర్తి.

5

భోజనాలయ్యేసరికి రాత్రి పదయింది.

చంద్రం, మధుమూర్తి ఇద్దరూ చొక్కాలు తగిలించుకుని వీధిన పడ్డారు. మాటా పలుకూ లేకుండా మౌనంగానే చాలాదూరం వెళ్ళారు. వీధి చివర్న పేవ్ మెంటు పైన కూర్చున్నారు.

"బావగారూ! ఆ లాయరు చంద్రశేఖరాన్ని చూశాను. అతని దగ్గర క్లయింటులు లేరు. గుమాస్తా అసలే లేడు. అతనుంటున్న ఇల్లు చాలా చిన్నది. నేను వెళ్ళగానే అతనే నన్ను రమ్మని పిలిచాడు." అంటూ ఆగాడు బీడి వెలిగించుకునేందుకు.

"అయితే ఏమంటావ్?" అడిగాడు మధుమూర్తి.

"అలాంటి మామూలు మనిషి లెటర్ హెడ్స్‌తో మీకొచ్చిన పని ఏమయి వుంటుందాని నాకు అర్థంగాలేదు. అందుకు మీరు దాదాపు ఐదువేలు ఇవ్వచూపారు. అతను మనిషే అంత ఖరీదయినవాడులా కనిపించలేదు. మరి అతని లెటర్ హెడ్స్‌కు మీరంత డబ్బు పెట్టదలుచుకోవటం నాకు విచిత్రంగానూ, కుతూహలంగానూ వుంది" అన్నాడు చంద్రం.

"అదంతా నీ కనవసరం. నీకు చిన్న పని అప్పగించాను. అది చేసినందుకు తగినదానికన్నా ఎక్కువ పారితోషికం ఇస్తానన్నాను. నీకిష్టముంటే చెయ్యి. లేదంటే మానెయ్యి" ఖండితంగా చెప్పాడు మధుమూర్తి.

"బావగారూ! అలాగనకండి. నాకు చెప్పిన పని చిన్నదే ననుకుంటున్నారు మీరు. కాని నిజానికి అదే పెద్దది. ఉత్తరో త్తరా ఏదయినా నేరానికా కాగితాలు ఉపయోగింపబడ్డట్లు బుజావు కావచ్చు. అప్పుడా కాగితాలు దొంగిలించిం దెవరన్న ప్రశ్న వేస్తారు. నన్ను పట్టుకొంటే మీరు అడ్డువచ్చి రక్షించగలుగుతారా?" అడిగాడు చంద్రం.

"ఒకవేళ నీకు చెబితే మాత్రం, నువ్వు నిన్ను అలాంటి ఆపదనుండి ఎలా తప్పించుకోగలుగుతావు?" అడిగాడు మధుమూర్తి.

"ఎలాంటి ఆపద రాగలదో కనీసం వూహించుకోగలను. అందుకు సన్నద్ధంగావుండే వీలుంటుంది. అదృష్టం బాగుంటే తప్పించుకోగలుగుతాను."

"ఇది నీకు చెప్పడం వీలుకాదు. నే చెప్పింది మరచి

పో. వేరే ఎవర్నైనా చూసుకుంటాను" అన్నాడు మధుమూర్తి కోపంగా.

"అయితే రేపే వెళ్ళి ఆ చంద్రశేఖరంగారితో మీరేదో కుట్ర తలపెట్టినట్లు చెపుతాను. అతని కాగితాలు జాగ్రత్తగా పెట్టుకోమని చెపుతాను. దాంతో మీ ఆట కట్టవుతుంది."

"అతను నమ్మడు."

"నీ బావమరదిని స్వయానా వెళ్ళి వివరంగా చెప్తూంటే, నమ్మకపోవడానికి అతనేం వాజమ్మ కాదు" అన్నాడు చంద్రం.

మధుమూర్తి ఆలోచనలో పడ్డాడు.

అసలే చంద్రం పెద్ద లిటిగెంటు. మడత పేచీలు వెయ్యడంలో పెద్ద దిట్ట. అతని బ్రతుకు తెరువు కూడా అదే. అతనితో అసలీ వ్యవహారం కదలించకుండా వుండి వుంటే బాగుండేదేమోననిపించింది.

"ఏంటి బావా ఆలోచనలో పడ్డావ్?" హెచ్చరించాడు చంద్రం.

"ఏం లేదు! నాకో స్నేహితుడున్నాడు. అతనే ఈ పని నాకు అప్పగించాడు. అసలీ కాగితాలెందుకో నాకూ తెలీదు. రేపు అతన్ని కలుసుకొని అడిగి తెలుసుకుంటాను. ఆ తర్వాత నీకు చెపుతాను" అన్నాడు మధుమూర్తి.

"ఈ మాట నేను నమ్మను. లాయరువై వుండి అన్ని సంగతులూ తెలుసుకోకుండా, ఈ పనిలోకి నీలాంటి మనిషి దిగడు" అన్నాడు చంద్రం ఖండితంగా.

"నీ నమ్మకంతో నాకు పనేమీ లేదు. నిజం చెప్పాను" అన్నాడు మూర్తి.

"అయితే ఎల్లుండి ప్రొద్దుటదాకా ఆగుతాను. ఆ తర్వాతనాకు నిజం చెప్పకపోతే, అన్నంతపనీ చేస్తాను" అన్నాడు చంద్రం.

"అలాగే చేద్దువుగాని. పద ఇంటికె పోదాం!" అన్నాడు మూర్తి లేచి నిలుచుని. చంద్రం కూడా అతన్ని అనుసరించాడు.

6

అంతా విన్నాడు నిరంజనరావు, మధుమూర్తి చెప్పిందంతా.

"మన ఇద్దరికన్నా చంద్రం తెలివిగలవాడులా వున్నాడు" అన్నాడు కాఫీ తాగి.

"ఏం తెలివో! మధ్య నా ప్రాణాలు తీస్తున్నాడు" నిస్పృహతో నిట్టూర్చాడు మధుమూర్తి.

"అలాగనకు. అతన్ని కూడా మనలో భాగం కలుపుకుందాం."

"నువ్వీ మాట మనస్ఫూర్తిగా చెప్తున్నావా?" ఈ

"ఆఁ! మనస్ఫూర్తిగానే చెపుతున్నాను. సాయంత్రం ఇద్దరూ బీచ్ కి రండి. అక్కడ మాట్లాడుకుందాం. అతని మొత్తం నేనే చెపుతాను" అన్నాడు నిరంజనరావు.

"అలాగే!" అని మధుమూర్తి వెళ్ళిపోయాడు.

సాయంత్ర బీచ్ లో ముగ్గురూ కలుసుకున్నారు. మధు మూర్తి చంద్రాన్ని పరిచయం చేశాడు. అంతా ఇసుకలో కూచున్నారు.

నిరంజనరావు తన పథకం మొత్తం చెప్పాడు. చంద్రం చప్పుడు చెయ్యకుండా, మధ్య మధ్య ప్రశ్న

లేమీ అడగకుండా విన్నాడు. అంతా ముగిశాక "ఇదీ మా పథకం. ఎలా వుంది?" అడిగాడు నిరంజనరావు.

"చాలా బాగుంది. కానీ లాయరు చంద్రశేఖరం ఇంటికి వెళ్ళాను. చూశాను. అతని కంత డబ్బు వుంటుందని నాకనిపించడం లేదు" అన్నాడు చంద్రం.

"ఆ విషయంలో నాకు అనుమానం లేదు. ఒకవేళ అలా లేదనుకుందాం. అందువల్ల జరిగే ప్రమాదమేమీ లేదు. మన ప్రయత్నం అక్కడే ఆగిపోతుంది. మనం సురక్షితంగానే వుంటాం. కాకుంటే ఖర్చుల క్రింద కొంత మన డబ్బు పోతుంది" అన్నాడు నిరంజనరావు.

"అలాగనుకుంటే మనం ప్రయత్నం ప్రారంభించవచ్చు" అంటూ చంద్రం చొక్కా లోపలనున్న బనీను వెనుకనుంచి ఒక ప్లాస్టిక్ కవరు వెలుపలకు తీశాడు.

"ఏమిటది?" అడిగాడు మధుమూర్తి.

జవాబు చెప్పకుండా దాన్ని తెరిచాడు. అందులోంచి కొన్ని కాగితాలు, కవర్లు వెలుపలకు లాగాడు.

"అయితే సాధించుకొచ్చావన్నమాట!" అన్నాడు నిరంజనరావు ఆనందంగా.

"ఆఁ! నాలుగు లెటర్ హెడ్స్, నాలుగు కవర్లు. అతను సంతకం చేసిన వకాల్తా కాగితం పట్టుకొచ్చాను. ఇవి చాలనుకుంటాను" అన్నాడు చంద్రం.

"నువ్వు అఖండుడివి. ఎలా తెచ్చావ్?"

"ఆ వివరాలు అనవసరం. ఇక జరగవలసింది చూడండి. చంద్రశేఖరంగారింట్లో పాత గాడ్రేజ్ టైప్ మిషనుంది. అతని ఉత్తరాలు దానిపైనే టైపు చేస్తూ వుండవచ్చు" అన్నాడు చంద్రం.

"అచ్చా! అది కూడా చూశావన్న మాట! మనం
షెపు చేయించేటప్పుడు ఆ మోడల్ మిషన్ మీదనే
చేయించవచ్చు."

"అన్ని వివరాలు ఒకేసారి తెలుసుకోవటం మంచిది.
పదే పదే వెళ్తే పదిమంది కంట్లో పడతాం" అన్నాడు
చంద్రం.

"ఇప్పుడు ఇక జరగవలసింది, చంద్రశేఖరం సంతకం
ఈ కాగితాలపైన ఫోర్జరీ చేయించడమే" అన్నాడు
నిరంజనరావు.

"మీకు తెలిసినవాళ్ళున్నారా?"

"నాకు తెలిసినతనున్నాడు ఏలూరు దగ్గర. అతని
దగ్గరకు వెళ్దామనుకుంటున్నాను" అన్నాడు మధు
మూర్తి.

"అంటే మన వ్యవహారం నాలుగో మనిషితో పంచు
కోవటమన్నమాట అది నాకిష్టం లేదు" అన్నాడు
చంద్రం.

"మరెలా?"

"ఫోర్జరీ చెయ్యడం ఒకరకంగా విద్యే. అది పెద్ద
సాధించలేని విద్య కాదు. అభ్యాసం కావాలి. ఎవరైనా
పట్టుదలతో ఒకటికి పదిసార్లు లేదా పదివేలసార్లు
ప్రయత్నం చేస్తే, ఎవరి సంతకమయినా ఫోర్జరీ చెయ్య
వచ్చు. మనం ముగ్గురం వున్నాము. అందరం ప్రయత్నం
చేద్దాం. ఎవరు చెయ్యగలిగినా సరిపోతుంది. నాలుగో
మనిషి అవసరం వుండదు" అన్నాడు చంద్రం.

"నీ అభిప్రాయం బాగానే వుంది. కానీ మనవల్ల
అవుతుందా?" అనుమానం వ్యక్తపరచాడు మధుమూర్తి.

"మనం ప్రారంభించిన పని మాత్రం ఎటువంటిది?

ఇంతకు ముందు మీరు చేసిందేమీ గాదుగా. మీ మేధస్సులు పని చేశాయి. ఈమారు చేతులు పనిచేస్తాయి. అంతే!'' అన్నాడు చంద్రం.

''చంద్రం చెప్పిందే బాగుంది. మనమే ప్రయత్నిద్దాం! మనవల్ల కాదని తేలిపోతే అప్పుడే వేరే ప్రయత్నం చేద్దాం!'' అన్నాడు నిరంజనరావు.

''అందరూ అవసరం లేదు. నేనే ప్రయత్నిస్తాను. రెండ్రోజులు టైమివ్వండి చాలు!'' అన్నాడు విశ్వాసంగా చంద్రం.

''రైట్! ఆ బాధ్యత నీదే!'' అన్నాడు నిరంజనరావు.

''మీరు రేపు మధురకు వెళ్ళండి. అకౌంట్ ఓపెన్ చేసి రండి. మీరు వచ్చేసరికి నేను సంతకం చెయ్యడం నేర్చుకుంటాను. మనముగ్గురం కూర్చుని వుత్తరం తయారు చేద్దాం. ఆ తర్వాత పంపుదాం'' అన్నాడు చంద్రం నిరంజనరావుతో.

''ఓ. కే.'' ఒప్పుకున్నాడు నిరంజనరావు.

''మరో విషయం. ఆశకు అంతుండదంటారు. మనకు పది లక్షలు దొరికినా మరో పది లక్షలు దొరకలేదే అనుకుంటాం. మన పథకం దిగ్విజయంగా జరగాలంటే మన ఆశకు ఒక అంతం పెట్టుకోవాలి!'' అన్నాడు చంద్రం.

''అంటే?'' అడిగాడు మూర్తి.

''మీరు లక్ష రూపాయలు ట్రాన్స్‌ఫర్ చెయ్యమని రాద్దామని నిర్ణయించుకున్నారు. అంత డబ్బు అతని అకౌంటులో లేకపోవచ్చు. ఉన్నా అంతంత మొత్తం ట్రాన్స్‌ఫరు చేయటంలో ఏవైనా జాగ్రత్తలు బ్యాంకు తీసుకోవాలన్న నియమం వుండవచ్చు. కాబట్టి మనం అనుకున్న మొత్తాన్ని తగ్గించడం మంచిది'' అన్నాడు చంద్రం.

"ఎంత మొత్తం అడుగుదాం?" నిరంజనరావు అడిగాడు.

"ముందు పదిహేను వేలు పంపమందాం. తలా ఐదు వేలు వస్తాయి. ఖర్చులు కూడా ముగ్గురం పంచుకుందాం. అది జయప్రదంగా జరిగిపోతే ఆ తర్వాత మరో ఉత్తరం పంపుదాం!" అన్నాడు చంద్రం.

"గుడ్! నీ తలలో వున్నదంతా మెదడేనోయ్! మాకు ఇక నువ్వే నాయకుడివి. నువ్వు చెప్పినట్లు మేమిద్దరం చేస్తాం" అన్నాడు నిరంజనరావు.

మధుమూర్తి అవాక్కయి చూడసాగాడు.

చంద్రం బావగార్ని చూసి చిరునవ్వు నవ్వాడు.

7

"ఇవాళ ఆరో రోజు!" అన్నాడు చంద్రం.

"ఏమిటి?" అనడిగాడు నిరంజన్.

"మనం ఉత్తరం పోస్టు చేసి" అన్నాడు మధుమూర్తి.

"ఉత్తరం చేరేందుకు మూడు రోజులు పడుతుంది. ఆ తర్వాత బ్యాంక్‌లో కనీసం మరో మూడు రోజులు తీసుకొంటుంది. డబ్బు ఇండియాకు బదిలీ చేసినట్లు పంపే ఉత్తరం ఇక్కడకు రావడానికి మరో మూడు రోజులు పడుతుంది. అంటే ఇంకొక నాలుగు రోజులన్నా మనం ఆగి చూడాలి ఓపిగ్గా!" అన్నాడు నిరంజనరావు.

"మూడు రోజులా? నాకు మూడు యుగాల్లా వుంది" అన్నాడు మధుమూర్తి.

"పోలీసులకు చిక్కామంటే మన ముగ్గురం కనీసం మూడేళ్ళన్నా జైలు కమ్మీలు లెఖ్ఖపెట్టిస్తారు. అంత ఆగలేకపోతే ఎలా?" కోపంగా అన్నాడు చంద్రం.

"మీ బావమరదుల సరసాలు ఆపండి. ఆ డబ్బు డ్రా చెయ్యటం ఎలా?"

"సెల్ఫ్ చెక్ రాయండి. నేను తీసుకెళ్ళి కాష్ తెస్తాను" అన్నాడు చంద్రం.

"వద్దులే! నేను తెస్తాను. చెక్ నాకు రాసివ్వు" అన్నాడు మధుమూర్తి.

"ఏం నేను డబ్బు తీసుకుని మీకు భాగం ఇవ్వననేగా నీ భయం! అలాంటి అనుమానాలు పెట్టుకోవద్దు" అన్నాడు చంద్రం.

"ఛ! అందుక్కాదు. నేనూ నిరంజనరావూ మధుర వెళ్ళి డబ్బు తెస్తాం. నువ్వు ఇక్కడే వుండి, లాయర్ చంద్రశేఖరంకు ఆ బ్యాంక్ నుంచి డబ్బు అతను కోరిన ప్రకారం బదిలీ చేస్తున్నట్లు ఉత్తరం వస్తుందేమో గమనించి దాన్ని చిక్కించుకోవాలి.

"నువ్వు నీ కేసు విషయంలో వెళ్ళినట్లుగా వెళ్ళి, పోస్టు వచ్చేసమయానికి అలాంటి వుత్తరం వస్తే ఎలాగయినా అతనికి అందకుండా చూడు. అది వీలుగాక పోతే మధురలో మేమున్న హోటల్ కు ట్రంకాల్ చెయ్యి. డబ్బు డ్రా చెయ్యకుండా ఆగిపోతాం!" అన్నాడు మధుమూర్తి.

"ఇది బాగానే వుంది. ఈ పని నీవల్లే అవుతుంది" అన్నాడు నిరంజనరావు.

8

మూడు రోజులు గడిచిపోయాయి.

నిరంజనరావు, మధుమూర్తి మధుర వెళ్ళి హోటల్

మీనాక్షిలో బస చేశారు. చంద్రం మద్రాసులో గోపాల పురం చుట్టూ తిరగటం మొదలెట్టాడు.

నిరంజనరావు బ్యాంకుకు ఫోన్ చేసి, యస్. ఆర్ముగం అక్కౌంట్ లో డబ్బేదయినా క్రెడిట్ అయిందాని అడిగాడు. అవతలనుండి మేనేజరు అయిందని చెప్పాడు.

నిరంజనరావు గదిలో ఎగిరి గంతులు వెయ్యసాగాడు.

"ఏమయింది?" అడిగాడు పట్టుకుని మూర్తి.

"డబ్బు వచ్చిందట" చెప్పాడు నిరంజనరావు.

"అబ్బ! మన ప్లాను మిల్లిమీటరు తేడా లేకుండా అమలు జరిగింది. సరే చెక్ రాయి" అన్నాడు మూర్తి.

నిరంజనరావు రాసిచ్చాడు.

చెక్ అందుకుని చిందులు వేసుకుంటూ వెళ్ళిపోయాడు మధుమూర్తి. ఆటో మాట్లాడుకున్నాడు బ్యాంక్ దాకా. బ్యాంక్ దగ్గర దిగగానే అతనికి భయం వేసింది. చెక్ మార్చుకోను వచ్చిన మామూలు మనిషిలా గాకుండా, దొంగతనం చెయ్యడానికి వచ్చిన వాడిలా ఫీలయ్యాడు.

సంతకం చేసిన చెక్ ఇవ్వగానే, కౌంటర్ లో వున్న గుమాస్తా టోకన్ ఇచ్చాడు. ఆ తర్వాత పది నిముషాలకు నూటయాభై వందరూపాయల నోట్లు తీసుకుని బ్యాంక్ వెలుపలకు వచ్చాడు మూర్తి. క్షణం ఆగకుండా, కను పించిన ఆటో ఎక్కి మీనాక్షి హోటల్ కు పోనిచ్చాడు.

రెండేసి మెట్లు ఒక్కసారే ఎక్కుతూ పైకి వెళ్లాడు. గదిలోకి దూరి తలుపులు బిగించి, వందరూపాయల నోట్లు నడిమంచంమీద వేశాడు.

ఎవరో తలుపు తట్టిన చప్పుడయింది.

ఇద్దరూ కర్రల్లా బిగుసుకుపోయారు. అంతకు ముందు దాకా పురకలు వేసిన ఆనందం, ఒక్కసారిగా అంతర్ధానమైపోయింది.

గబగబ డబ్బు పోగుచేసి, పరుపు క్రిందకు తోశాడు మూర్తి.

"ఎవరది?" అడిగాడు నిరంజనరావు.

జవాబు రాలేదు. కానీ తలుపు చప్పుడైంది.

లాభం లేదని వెళ్ళి తలుపు తీశాడు. ఎదురుగా చంద్రం కనుపించాడు.

"నువ్వా? ఎందుకొచ్చావ్?" అడిగాడు మూర్తి.

"ఏం రాకూడదా?"

"నీకు ఒప్పగించిన పని వదలిపెట్టి ఇలా రావడం ప్రమాదం కదూ!" అడిగాడు మూర్తే మళ్ళీ.

"నేనేం పసిపిల్లాడ్ని కాదు. అతని కలాంటి ఉత్తరాలు రాలేదు, రావు. ఆ విషయం రూఢి చేసుకున్నాక వచ్చాను" అన్నాడు చంద్రం,

"ఎలా రూఢి అయింది?" అడిగాడు నిరంజన్.

"పోస్టుమేన్‌ను పట్టుకున్నాను. అతన్ని వాకబుచేశాను. ఆ ఏరియాలోనే అతను రెండేండ్లుగా పని చేస్తున్నాడట. ఇతర దేశాల నుండి అతనికి అంతగా ఉత్తరాలు రావట. ఏటా ఒక్కసారి మాత్రం లావుపాటి కవరొకటి బ్యాంక్ నుండి వస్తుందట. అందువల్ల వచ్చేశాను" అన్నాడు చంద్రం.

"నయం. ఆ మాత్రం కనుక్కున్నావ్" అన్నాడు మధుమూర్తి.

"ఇంతకూ ఏమయింది?" అడిగాడు చంద్రం.

నిరంజనరావు పరుపు పైకెత్తి చూపించాడు. క్రింద వందరూపాయల నోట్లు చెల్లాచెదురుగా పడి వున్నాయి. వాట్ని చూడగానే చంద్రం కళ్ళు గర్వంతో మెరిశాయి.

ముగ్గురూ తలో ఐదువేలు పంచుకున్నారు.

"మళ్ళీ వుత్తరం పంపుదాం" అన్నాడు మూర్తి.

"చంద్రం ఎంత డబ్బు బదిలీ చెయ్యమందాం?" అడిగాడు నిరంజనరావు.

"తక్కువ తక్కువగా రాస్తే మన దగ్గరుండే మూడు కాగితాలతో మరో యాభైవేలు వస్తుంది. అవతల వాళ్ళ కూడా అనుమానం రావచ్చు. పెద్ద మొత్తం రాస్తే, అంత డబ్బు వుంటుందో, వుండదో మనకు తెలీదు. కాబట్టి, అకౌంటులో వున్న మొత్తం డబ్బు బదిలీ చెయ్యమంటే సరిపోతుంది" అన్నాడు చంద్రం.

"బ్రహ్మాండమైన ఐడియా!" అన్నాడు నిరంజనరావు మెచ్చుకుంటూ.

"ఈ దెబ్బతో లాయరు చంద్రశేఖరం దివాలా తీస్తాడు" అన్నాడు మూర్తి.

అక్కడికక్కడే కూర్చొని లెటర్ తయారు చేశారు. అంతకు ముందే సంతకాలు చేసివున్న కాయితాలు తీసుకుని, చిన్న టైప్ ఇన్‌స్టిట్యూట్‌లోకి వెళ్ళి తమకు కావలసిన మెషిన్ మీద ఉత్తరం టైపు చేసుకుని, అందుకు ప్రతిఫలంగా పదిరూపాయలు ఇచ్చి బైటపడ్డారు. ఆ ఉత్తరం మధురనుండే పోస్టు చేశారు. రాత్రి రైలుకు టిక్కెట్లు కొనుక్కొని మద్రాసుబయలుదేరారు ముగ్గురూ.

9

మళ్ళా తొమ్మిది రోజులు గడచిపోయాయి.

ముగ్గురూ మధురకు టాక్సీలో బయలుదేరారు. అంతకు ముందులాగే మీనాక్షి హోటల్‌లో రూమ్ తీసుకుని దిగారు.

నిరంజనరావు ఫోన్ చేశాడు బ్యాంకికి. మేనేజర్ ఫోనందుకుని "హల్లో" అన్నాడు.

"మేనేజరుగారేనా?" అడిగాడు నిరంజనరావు.

"అవును. మీరెవరు?"

"యస్. అర్కుగాన్ని. నా అకౌంటు నెంబరు ఆరు వందలా ఆరు. నా అకౌంటుకు కొంత డబ్బు జమ కావల్సి వుంది. అది అయిందో లేదో చూసి చెపుతారా?" అడిగాడు.

"చూడనవసరం లేదు. జమ అయింది. మీరెక్కడ నుంచి మాట్లాడుతున్నారు?" అడిగాడు అవతలివేపు నుండి మేనేజర్.

"ఇప్పుడే ఈ వూరొచ్చాను. పబ్లిక్ టెలిఫోన్ నుంచి మాట్లాడుతున్నాను" అన్నాడు తక్కున ఎందుకయినా మంచిదని.

"ఓసారి మీరు బ్యాంక్‌కి రాగలరా?"

"ఎందుకు?"

"మిమ్మల్ని చూడాలంటూ మద్రాసునుంచో మనిషి వచ్చాడు. మీతో పనుందట. మిమ్మల్నింతకు ముందు చూడలేదట. వస్తారా?"

"చాలా బిజీగా వున్నాను. ఇంతకూ నా అకౌంటు కెంత జమయిందో చెప్పలేదు."

"ఇరవై రెండు లక్షల రూపాయలు" అన్నాడు మేనేజర్.

ఫోన్ చేతిలోంచి జారి క్రిందపడిపోయింది.

చంద్రం తక్షణ ఫోన్ కట్ చేసి పారేశాడు. నిరంజనరావు మంచంపైన కూలబడ్డాడు.

"ఏమయింది?" అడిగాడు చంద్రం ఆత్రుతగా.

"ఇరవై రెండులక్షల రూపాయలు ట్రాన్స్ఫర్ చేశారట."

"అయితే అలా నీరుగారిపోయారేం?"

"నన్ను చూడాలంటూ ఒకమనిషి తిష్టవేసుకుని కూర్చున్నాడుట. అతను మద్రాసునుండి వచ్చాడుట. మేనేజర్ చెప్పాడు" అన్నాడు నిరంజనరావు.

"అంటే మనంచేసిన మోసం చంద్రశేఖరంకు తెలిసిపోయింది. ఇక మనం ఆ బ్యాంకుజోలికి పోయి లాభం లేదు" అన్నాడు చంద్రం.

"ఎలా తెలిసుంటుంది?" అడిగాడు మూర్తి.

"ఏమో? నా ఊహాప్రకారం అతనుకూడా కొంత డబ్బు పంపమని బ్యాంకుకు లెటర్ పంపివుంటాడు. అతని ఉత్తరంకన్నా మన ఉత్తరం ముందు చేరివుంటుంది. డబ్బు మొత్తం ఆర్యోగం అకౌంటుకు ట్రాన్స్ఫర్ చేసివుంటారు. రెండో ఉత్తరం చేరగానే లాంగ్ డిస్టన్స్ కాల్ చేసి జరిగింది చంద్రశేఖరంకు చెప్పివుంటారు. అతను రెండు దినాలనుండే ఇక్కడ వుండివుంటాడని నా అనుమానం" అన్నాడు చంద్రం.

"అదే అయివుండాలి!" అన్నాడు నిరంజనరావు.

"ఇప్పుడేమిటి చెయ్యడం?"

"మనం దాని జోలికి పోగూడదు. గుట్టుగా మద్రాసు వెళ్ళిపోదాం. చంద్రశేఖరం ఆ డబ్బు తాకలేదు. ఎప్పటికయినా అది మనదే. అతను ఎన్నిరోజులు అలా కని

పెట్టుకుని వుండగలుగుతాడో చూద్దాం" అన్నాడు చంద్రం.

"ఐడియా బాగానేవుంది. అయితే వెళ్ళిపోదామా?" అడిగాడు మూర్తి.

"ఊఁ!" అన్నాడు నిరంజనరావు.

ముగ్గురూ గది ఖాళీచేసి మద్రాసు వెళ్ళేందుకు టాక్సీ మాట్లాడుకున్నారు.

టాక్సీ స్పీడుగా పోతోంది.

"ఇంతడబ్బు అతనికెక్కడనుండి వచ్చి వుంటుంది?" అడిగాడు చంద్రం నోరుమూసుకుని కూర్చోలేక.

"అదే నాకు అర్థంగావటంలేదు. ఏదయినా స్మగ్లింగ్ వ్యాపారం చేస్తున్నాడేమో?" అనుమానం వ్యక్తం చేశాడు నిరంజనరావు.

"ఈడబ్బు అతనిదయి వుంటుందని నేననుకోను. టి. వి. లు కొన్నప్పటినుంచే నాకు అనుమానంగావుంది" అన్నాడు మధుమూర్తి.

"టి. వి. లేమిటి?" అడిగాడు చంద్రం.

నిరంజనరావు వివరంగా చెప్పాడు.

"ఇక ఈ విషయాలు చర్చించవద్దు. మద్రాసుకెళ్ళాక మాట్లాడుకుందాం" అంటూ ఇద్దరికీ డ్రయివరును చూపించి సైగ చేశాడు.

నాలుగోమనిషి ముందు యీ విషయం చర్చించటం క్షేమం కాదన్న సంగతి వాళ్ళకు అర్థమయింది.

టాక్సీ వేగంగా పరుగెత్తుతూనేవుంది. రాత్రి పన్నెండుకి మద్రాసు చేరారు.

10

నిరంజనరావు, చంద్రం వేరే టాక్సీ చేసుకొని మాంబళం వెళ్ళారు.

ఒక ఇంటిముందాగింది టాక్సీ. దిగి లోనికి వెళ్ళారు. కాలింగ్ బెల్ నొక్కగానే తలుపు తెరచుకుంది. ఎదురుగా అందమైన అందాల భరిణె వయ్యారాలు ఒలకపోస్తూ కనుపించింది.

"బిజీగావున్నావా?" అడిగాడు నిరంజనరావామెను.

"లేదు ఖాళీగానే వున్నాను వారంనుంచి. రండి" అంది నవ్వుతూ.

"ఇతను నా ఫ్రెండు చంద్రం. హిందీ సినిమా తీస్తున్నాడు" అన్నాడు ముందుగా నిర్ణయించుకున్నట్లుగా నాటకం నడుపుతూ.

చంద్రంకు నమస్కారం పెట్టింది ఆమె.

"ఈమె పేరు జ్యోతి. ఈవిడగురించే చెప్పింది మీకు" అన్నాడు నిరంజనరావు.

"ఏం చెప్పారు?"

"అందమయిన క్రొత్తమ్మాయిని హీరోయిన్ గా బుక్ చేద్దామనుకుంటున్నాడట. నిన్ను సజెస్టు చేసాను" అన్నాడు నిరంజనరావు.

"థాంక్స్! హీరో ఎవరు?"

"అమితాబ్-బచ్చన్ ని పెట్టాలనుకుంటున్నాను" అన్నాడు చంద్రం.

"ఐ లైక్ హిమ్! ఐ లైక్ హిమ్! అతనితో హీరోయిన్ గా వేయటం అదృష్టంగా భావిస్తాను. నాకు యీ అవకాశం ఖచ్చితంగా కలిగించాలి" అంది జ్యోతి.

"అలాగే! కానీ మీవల్ల నాకో చిన్న సాయంకావాలి. మా నిరంజనం మాటల్లో మీకు లాయర్ చంద్రశేఖరం

బాగా తెలుసునని తెలిసింది. మీ టెలివిజన్ సెట్ కు అతనే డబ్బు ఇచ్చాడట. అతను బాగా వున్నవాడని ఇతని అభిప్రాయం. అతనితో మీ పరిచయం ఎలాంటిదో నాకు తెలీదు. కానీ అతని చేత నాకు కొంతడబ్బు పెట్టుబడి పెట్టించాలి. నేను ఇరవైలక్షలుదాకా పెడుతున్నా. ఇంకా పది లక్షలు కావాలి!'' అన్నాడు చంద్రం.

''అతన్ని నాకు తెలీదు. అతను డబ్బుగలవాడుకూడా కాదు. అతని బాస్ ఒకతను వున్నాడు. కొన్ని సినిమాలకూడా డబ్బు పెట్టాడు. పెద్ద ఎత్తున దొంగవ్యాపారము చేస్తున్నాడల్లేవుంది. మద్రాసు వచ్చినప్పుడు నాతో గడుపుతాడు. చాలా భయంకరమైన మనిషి. అతను లోపలుంటే ఇంటిచుట్టూ పదిమంది తిరుగుతూంటారు అతని మనుషులు. ఈమారు అతను వచ్చినప్పుడు అడిగి చూడమంటే చూస్తాను'' అంది జ్యోతి.

''అతని పేరు తెలుసా?'' అడిగాడు చంద్రం.

''వాళ్ళంతా బాస్ బాస్ అంటారు. అతని మెళ్ళో లాకెట్ వుంది. దాని డాలర్ పైన 'రాకేష్' అనివుంది. అదే అతని పేరేమో నాకు తెలీదు'' అంది జ్యోతి.

''అతను డబ్బు పెట్టినా పెట్టకున్నా మీకు వేషం ఖచ్చితంగా ఇస్తాను. వేరే యిద్దరు ముగ్గురుకూడా ముందుకొచ్చారు సాయం చేసేందుకు. మీకు త్వరలో కబురు పంపుతాను. కబురు అందగానే రావడానికి సిద్ధంగా వుండిండి'' అన్నాడు చంద్రం.

''అలాగే'' అంది జ్యోతి.

''వస్తాను!'' అంటూ లేచాడు చంద్రం.

"వేరే అవసరమైన పనేమీ లేకపోతే ఈ రాత్రికిక్కడ వుండి పోకూడదూ?" అడిగింది అందంగా.

"సారీ చాలా పనులున్నాయి. చూసుకోకపోతే ప్రాణంమీదికొస్తాయి. వెళ్తాను" అంటూ బయటపడ్డాడు చంద్రం. నిరంజనరావుకూడా అతన్ని అనుసరించాడు. కొంతదూరం వెళ్ళాక టాక్సీని వదిలేశారు.

"విన్నావా?" అడిగాడు చంద్రం.

"ఆఁ!" అన్నాడు నిరంజనరావు.

"ఆ డబ్బు మొత్తం రాకేష్‌ది. అతనెవరో తెలుసా. మనదేశంలోకల్లా పెద్ద స్మగ్లర్. అతనిక్రింద కొన్ని వేలమంది వున్నారు. అందరిదగ్గరా ఆయుధాలున్నాయి. అతనికి తనడబ్బునెవరో దొంగిలించినట్లు తెలిసిపోయింది. ఇక మొదలవుతుంది వేట. మనల్ని పట్టుకోవడంవాళ్ళకు కష్టంకాదు" అన్నాడు చంద్రం.

నిరంజనరావు మొఖాన కత్తివాటుకు నెత్తురుచుక్క లేదు.

11

ముగ్గురూ మౌనంగా కూర్చున్నారు. ఒక్కరినోటి వెంట మాటరాలేదు.

"ఆ బ్యాంక్ చుట్టూ గట్టి బందోబస్తు పెట్టివుంటారు" అన్నాడు మధుమూర్తి నిశ్శబ్దాన్ని బ్రద్దలుచేస్తూ.

"ఆఁ! ఆ ప్రాంతాలకు పోవడం ప్రాణాలమైకి తెచ్చుకోవడమే."

"ప్రతిదానికీ అలా నీరుకారిపోయే మీరు అసలిటు వంటి పనులకెందుకు దిగినట్లు" కోపంగా విసుక్కున్నాడు చంద్రం తన ఆలోచనలకు అడ్డురావడంతో.

"ఇలాంటి ప్రమాదం మనం ఎదురుచూడనిది. ఇప్పుడు ఆ రాక్షసునుంచి ప్రాణాలతో తప్పించుకోవడం ఎలా?" అడిగాడు నిరంజనరావు.

"ఇందుకు మార్గాలు కొన్ని కనిపిస్తున్నాయి. వాటిల్లో ఏది బాగుంటుందో ఆలోచిస్తున్నాను."

"ఏమిటవి? మాకు చెప్పు" నని గాడు మధుమూర్తి.

"ఆ డబ్బు నీ అకౌంటులో వున్నంతవరకు అతను నిన్ను చంపడు. చంపితే అంత మొత్తం అనవసరంగా ఎవ్వరికీ చెందకుండా పోతుంది. అలాగాకుండా నిన్ను చిక్కించుకుని నీచేత రాయించుకొని, ఆ తర్వాత కసి కొద్దీ చంపి పారేసే అవకాశం వుంది. మనం ఈలోగా అతనితో బేరానికి దిగవచ్చు. ఒకటి మన ప్రాణ రక్షణ కోసం సంవత్సరానికి లక్ష రూపాయల వంతున అతని డబ్బు అతనికి తిరిగి ఇస్తామని చెప్పవచ్చు. అందుకు ఒప్పుకుంటే దాదాపు ఇరవై రెండు సంవత్సరాలు మనకు ప్రాణభయం వుండదు. అలా కాదంటే, అతన్ని ఎదుర్కొని చంపడానికి మనం సిద్ధపడాలి. ఇంతకన్నా మార్గాలు నాకు కనుపించలేదు" అన్నాడు చంద్రం.

"అతన్ని చంపగలమా?"

"మనం చావడం తథ్యం అని తెలిశాక అతన్ని చంపడానికి ప్రయత్నించి, ఆ ప్రయత్నంలో చచ్చినా ఫర్వాలేదు."

"అంటే మన ముగ్గురి ప్రాణాల విలువ కేవలం పదిహేను వేల రూపాయలన్న మాట!" మధుమూర్తి అన్నాడు.

"అన్నమాట కాదు! అది వున్నమాట."

"దానికన్నా అతనితో బేరానికి దిగితే ఎలా వుంటుంది?" అన్నాడు నిరంజనరావు.

"బాగానే వుంటుంది. ఇంతకీ ఆ రాకేష్ ఎక్కడుంటాడు! వాడ్ని కలుసుకోవడమెలా? మన తరఫున అతని దగ్గర బేరం చేసేదెవరు?" అడిగాడు మూర్తి.

"లాయర్ చంద్రశేఖరం ద్వారానే జరగాలి యీ ఘట్టమంతా" చంద్రం చెప్పాడు.

"అతన్ని కలుసుకుంటేమనల్ని రాకేషుకు పట్టివ్వడా?" తన అనుమానం విశదీకరించాడు నిరంజనరావు.

"మనం నేరుగా వెళ్ళవద్దు. ఏదో పబ్లిక్ బూత్ నించి మాట్లాడుదాం."

"సరే నీ యిష్టప్రకారమే కానివ్వు! నిండా మునిగాక చలేమిటి?" అన్నాడు నిరంజనరావు దిగులుగా.

"నాకింకో ఆలోచన వస్తూంది."

"ఏమిటి?"

మనం ఈ సమాచారం ప్రభుత్వానికి చెప్పి వాళ్ళ రక్షణకోరితే ఎలావుంటుంది" అడిగాడు నిరంజనరావు.

"మామూలుగా స్మగ్లర్స్‌కు పెద్దపెద్ద వాళ్ళతో లావాదేవీలు వుంటాయి. మనంవెళ్ళి చెప్పినా వినిపించుకుంటారని నేననుకోను. వాడి నేరాలువదలి మననేరం మాత్రం లెక్కలోకి తీసుకొని జైల్లో తోసినాతోస్తారు. అదంత తెలివయిన పనిగాదు" అన్నాడు మధుమూర్తి.

"జరగవలసింది జరుగుతుంది. మనం అనుకొని లాభం లేదు" అన్నాడు నిరంజనరావు అక్కణ్నించి లేస్తూ.

12

నిరంజనరావు ఆటో వేసుకుని షాపుకి వెళ్ళిపోయాడు. షాపు ముందు దిగి డబ్బులిచ్చి లోనికి వెళ్ళాడు.

తన రూమ్ తలుపు తీసేసరికి లోపల జ్యోతి కూర్చుని వుంది. ఆమె వెంటో వ్యక్తి వున్నాడు.

"ఇవాళ ఆలశ్యంగా వచ్చినట్లున్నారు?" అడిగింది జ్యోతి.

"అఁ! ఏమిటి ఇవాళ ఇలా పెందలాడే వచ్చేశారు?" అడిగాడు నిరంజనరావు.

"రాత్రి మీరు వచ్చి వెళ్ళాక, నే చెప్పిన మనిషి మద్రాసుకు వచ్చాడు. నాకు ఫోన్ చేశాడు. వీరు ఆయన సెక్రటరీ. మీరు చెప్పిన ప్రపోజల్ చెప్పాను. చాలా ఉత్సాహంగా అలాగే పెడతానన్నారు. వివరాలన్నీ మాట్లాడుదామని, మిమ్మల్ని కలుసుకోవాలన్నారు. ప్రొద్దున్నే వీరొచ్చారు. మీ యిల్లు మాకు తెలీదు. అందుకని ఇక్కడికి వచ్చి కూర్చున్నాం" అంది జ్యోతి.

రాకేష్ మద్రాసు చేరుకున్న విషయం రూఢిగా తెలిసిపోయింది. వొంటికి చెమటలు పట్టాయి.

"నాకు వివరాలేం తెలీవు. రాత్రి మీరు చూశారుగా మా ఫ్రెండుని. అతను సాయంత్రం కలుస్తానన్నాడు. కలిశాక ఇద్దరం వస్తాం. ఎక్కడికి రమ్మంటారో చెప్పండి" అడిగాడు నిరంజనరావు.

"ముందు మీరు రండి. అతను చెప్పిన విషయాలే మీరు చెప్పండి. రాకేష్ మళ్ళీ రాత్రికి వెళ్ళిపోవాలిట. అతనికి టయిమ్ బొత్తిగా లేదట" అంది జ్యోతి.

"నాకు వీలుగాదు! పొద్దున్న రావటం కష్టం. సాయంత్రం ఖచ్చితంగా వస్తాను" అన్నాడు నిరంజనరావు మొండిగా.

"మీరు రమ్మనగానే రాగలిగిన పరిస్థితిలో వుండరని మా బాస్ అభిప్రాయపడి నన్ను పంపారు" అన్నాడు

జ్యోతి పక్కనున్న వ్యక్తి కోటు జేబులోంచి రివాల్వరు తీసి బల్లపైన అతనికి కనబడేట్లు పెడుతూ.

అవాక్కయి బిగుసుకుపోయాడు నిరంజనరావు.

రాకేష్ మరీ అంత సులభంగా, త్వరగా, తన్ను అనుమానించగలరని అతను వూహించలేకపోయాడు. ముందురోజు రాత్రి జ్యోతిని కలుసుకోవడం చాలా తప్పయిపోయిందని గ్రహించాడు. ఇదే స్థితిలో చంద్రం వుంటే ఏం చేసివుండేవాడో అర్థం కాలేదు. అతనీ పరిణామం వూహించి వుండకపోవచ్చు. వాళ్ళ వెంట వెళ్ళడం తప్పదన్నట్లు తేలిపోయింది.

"ఆయుధాలు చూపించి భయపెట్టనవసరం లేదు. పదండి వస్తాను" అన్నాడు నిరంజనరావు. ముగ్గురూ కారెక్కారు.

కారు రివ్వుమని మద్రాసు వీధుల్లోంచి దూసుకుపోయింది. అరగంట ప్రయాణం తర్వాత ఒక పెద్ద కాంపౌండ్ లోకి వెళ్ళింది. ముగ్గురూ దిగారు. ఇంటిచుట్టూ జనం వున్నారు. అందరిదగ్గరా ఆయుధాలున్నట్లున్నాయి.

విశాలమైన గదిలోకి తీసుకెళ్ళారు నిరంజనరావును. ఎదురుగా పెద్ద కుర్చీలో కూర్చుని వున్నాడు రాకేష్.

"నా డబ్బును తెలివిగా దొంగిలించింది నువ్వేనా?" అడిగాడు సూటిగా రాకేషు.

"డబ్బా? దొంగతనమా? నాకేం తెలీదు. నన్ను ఎందుకో పిలిపించి ఏదో మాట్లాడుతున్నారు" అమాయకం నటించాడు నిరంజనరావు.

"చంద్రశేఖరం లాయరు. అతని పేరుతో స్విట్జర్లాండ్ లో ఒక బ్యాంక్ లో అకౌంటు వుంచాను. అతని సంతకం ఫోర్జరీచేసి, నా డబ్బంతా మధురలో వున్న

ఆర్ముగం అనే అతని అకౌంటుకు బదిలీ చేశారు. నా మనుషులు ఆ బ్యాంక్ చుట్టూ వున్నారు. ఆ ఆర్ముగం అకౌంటులోంచి డబ్బు డ్రా చేసే ప్రతి మనిషినీ, పట్టుకొని కాల్చిపారెయ్యమన్నాను. నీ ఫ్రెండెక్కడున్నాడు?" అడిగాడు రాకేష్.

"ఏదో హోటల్లో దిగానన్నాడు. నన్ను నిన్న షాపులో కలుసుకున్నాడు."

"ఈ నాటకాలు లాభం లేదు. మీ ఇద్దరిలో ఆర్ముగం సంతకం చేసేదెవరు?"

మౌనంగా వుండిపోయాడు నిరంజనరావు.

"చెప్పిందాకా చావదన్నండి" అరిచాడు రాకేష్.

జ్యోతి అతని వెంట కూర్చుని నవ్వసాగింది.

ఇద్దరు లావుపాటి మనుషులు వచ్చి కొరడాలతో మర్దన మొదలెట్టారు.

ఆ బాధను తట్టుకోలేక అసలు విషయం మొత్తం చెప్పాలనిపించింది. కానీ చంద్రం, మూర్తి బయటే వున్నారు. వాళ్ళ గురించి చెప్పనంతవరకూ, తనకు ప్రాణాపాయం వుండదని నోరు మూసుకున్నాడు.

ఆ దెబ్బలకు తట్టుకోలేక స్పృహతప్పి పడిపోయాడు.

13

చంద్రం పన్నెండు గంటల ప్రాంతంలో నిరంజనరావు ఆఫీసుకు వచ్చాడు. అతని గదిలోకి వెళుతుండగా, అక్కడున్న మనిషి ఎవరో ఒక ఆడామె, మగతను వచ్చి తీసుకెళ్లారని చెప్పాడు.

చంద్రానికి ఆ మాటతో అనుమానం వచ్చింది. తిన్నగా అతని గదిలోకి వెళ్ళి చూశాడు అక్కడేమైనా

ఈ తరంలాంటిదేదుంటుందేమోనని. అలాంటిదేమీ కని పించలేదు.

టేబుల్ పైనున్న పాడ్ పైన మాత్రం జ్యోతి, రాకేష రివాల్వరు అని పదే పదే బాల్ పెన్‌తో రాసి వుండటం గమనించాడు. అన్నింటి క్రింద ఆ రోజు తేది, టైమ్ వేసి వుంది.

చంద్రానికి పరిస్థితి అర్థమైంది. వెంటనే అక్కడ్నుంచి వెలుపలకు వచ్చేశాడు. తిన్నగా బావగార్ని కలుసుకుని జరిగిన ఘోరం చెప్పాడు.

"నిరంజనరావు వాళ్ళ చేతుల్లో వున్నాడంటున్నావ్. అతన్ని తంతే మన సంగతి చెప్తాడు. అప్పుడు మనల్ని కూడా గద్దల్ని తన్నుకుపోయినట్లు తన్నుకుపోతారు. ఇప్పుడేం చేద్దాం?" అన్నాడు మధుమూర్తి.

"ముందు అక్కను, పిల్లల్ని ఏదన్నా హోటల్లో పెట్టాలి. మీరు వెళ్ళి ఆ పని చూసి గంటలోగా మౌంట్ రోడ్ పోస్టాఫీసు దగ్గరకు రండి" అన్నాడు చంద్రం.

మధుమూర్తి వెళ్ళిపోయాడు. అతని బుర్ర భయంతో నిండిపోయింది.

గంటతర్వాత ఇద్దరూ టాక్సీయెక్కి కమీషనర్ ఆఫ్ పోలీసు ఆఫీసుకు వెళ్ళారు. ఆయన్ను కలుసుకుని జరిగింది మొత్తం వివరంగా చెప్పారు. నిరంజనరావు వాళ్ళ చేతుల్లో చిక్కిన విషయంకూడా చెప్పారు.

అంతావిన్నాక "మేము అతన్ని పట్టుకుని 'మీసా' క్రింద తోసేందుకు ప్రయత్నిస్తున్నాం" అన్నాడు కమీషనర్.

"నిరంజనరావు నా వివరాలు చెపుతాడు. వాళ్ళ మనుషులు నాకోసం వస్తారు. మీవాళ్లు నన్ను అంటిపెట్టుకుని వుంటే చాలు. మీరు సులభంగా రాకేషును పట్టుకోవచ్చు. అయితే ఎక్కువ బలగం కావాలి. అతనిచుట్టు యెప్పుడూ పెద్దగ్యాంగు వుంటుందని విన్నాను" అన్నాడు చంద్రం.

"ఓ. కే."

"ఇంతదాకా వాళ్లు మీకోసం రాలేదంటే మీ గురించి చెప్పివుండడు. అతను అలా చెప్పకుండానే చచ్చిపోతే..."

"నేను లాయరు చంద్రశేఖరంతో మాట్లాడుతాను. అతన్నివచ్చి కలుసుకోమంటాను. అతనితోపాటు రాకేషు మనుషులు వస్తారు. నన్ను, మా బావను బలవంతంగా కారెక్కిస్తారు. మీవాళ్ళు దాని వెంటవస్తే చాలు" అన్నాడు చంద్రం.

"బాగుంది పథకం!" అన్నాడు కమీషనర్.

అనుకున్నట్లుగానే చంద్రశేఖరం బుహారీకి వచ్చాడు. ఇద్దర్నీ బలవంతంగా రివాల్వరుతో జడిపించి కారులోకి ఎక్కించాడు. కారు రాకేషుబంగళావేపు బయలుదేరింది. దానికి కొంతదూరంలో పోలీసుకారు బయలుదేరింది. దానికి ఫర్లాంగు దూరంలో ఐదారు వ్యానులనిండాజవాన్లు రైఫిల్స్ పుచ్చుకొని అనుసరించారు.

రాకేషు బంగళా చేరగానే ఇద్దర్నీ కిందికి దించారు. అందరూ లోనికెళ్ళారు.

రాకేషు వికటంగా నవ్వాడు వాళ్ళను చూడగానే.

"మీలో అర్జునుడు ఎవరు?" అడిగాడు.

"ఎవరూ లేరు." అన్నాడు చంద్రం.

"ముగ్గురు మామూలు మనుషులు, నన్ను యెదిరించి, నాడబ్బు కొంగిలించి ప్రాణాలతో వుందామనుకోవడం నిజంగా విచిత్రంగావుంది. అదిచాలక నాడబ్బు నాకిచ్చే టందుకు కండిషన్లు పెట్టారటగదా?" అన్నాడు రాకేష్ కోపంగా.

వెలుపలినుండి తుపాకులు పేలిన శబ్దమయింది. క్షణా లలో పోలీసులు లోనికి జొరబడ్డారు. రాకేషును, జ్యోతిని అతని మనుషుల్ని బంధించారు.

రాకేషు ఈ మెరుపుదాడికి తట్టుకోలేక పోయాడు. అతని చేతికి కమీషనర్ స్వయంగా బేడీలు వేశాడు.

—: ఐపోయింది :—